క్లుప్తంగా

దళితులపై దాడులను అరికట్టాలి


జడ్పీటీసీ లీలా నవకాంతం

దెందులూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దళితులపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు పెరిగాయి. దళితులపై దాడులను అరికట్టాలని దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం అన్నారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు దళితులను కూటమి ప్రభుత్వ వేధింపులపై రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోరాటం చేస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. పోరాటాల ద్వారా దళితుల సత్తా చాటుదామమని వారు అన్నారు.

స్త్రీశక్తి పథకం అమలు చేయకపోవడం దారుణం

ఏలూరు (టూటౌన్): అంతర్రాష్ట్ర సర్వీసుల పేరుతో సాధారణ పల్లె వెలుగు బస్సుల్లో సైతం స్త్రీ శక్తి పథకం అమలు చేయకపోవడం అన్యాయమని తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగా రాష్ట్ర సరిహద్దు వరకు మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మన రాష్ట్రంలోని ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులను పక్క రాష్ట్రంలోని డిపోలకు నడిపే సందర్భాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో బస్సు నడిచేంత వరకు మహిళలకు ఫ్రీ బస్సు పథకం స్త్రీ శక్తి అమలుచేయాలని ఆయన కోరారు.

అక్టోబర్ 31 నుంచి తూర్పువీధి గంగానమ్మ అమ్మవార్ల జాతర

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో 150 ఏళ్ల చరిత్ర కలిగిన తూర్పు వీధి శ్రీ గంగానమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ పోతురాజు బాబుల ఆలయంలో అక్టోబర్ 31 నుంచి అమ్మవార్ల జాతర నిర్వహిస్తారని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఉదయం జాతర కమిటీ సభ్యులతో కలిసి తూర్పువీధి శ్రీ గంగానమ్మ అమ్మవార్ల జాతర 2025-26 పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వంకినేని భాను ప్రకాష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

'ఓ-నెగిటివ్' రక్తదానం

ఆదోని అర్బన్: అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన పరశురాం అనే వ్యక్తి అరుదైన ×ఓ-నెగిటివ్× రక్తాన్ని దానం చేశాడు. ఏలూరు పట్టణానికి చెందిన కేవీ లక్ష్మికి ఈ రక్తం అవసరం కాగా వారం రోజుల నుంచి బంధువులు వెతుకుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలో ఆ రక్తం ఎక్కడ దొరకలేదు. కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో ఉన్నకి విరుపాక్షి స్వామికి సమాచారం రావడంతో వారి స్నేహితుడు అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలో ఉన్న పరశురాంకు చెప్పారు. విషయం తెలుసుకుని హైదరాబాద్ నుంచి కేవీ లక్ష్మి బంధువులు కారులో బయలుదేరి గుంతకల్‌కు శనివారం అర్ధరాత్రి వచ్చారు. ఆదివారం తెల్లవారుజామున 1:30 గంటలకు గుంతకల్‌లో పరశురామ్ రక్తదానం చేశారు. ఈ రక్తంతో కేవీ లక్ష్మికి ఆపరేషన్ చేస్తారని వారు తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు

కొయ్యలగూడెం: గ్రామదేవత శ్రీచింతాలమ్మ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయాన్ని ఆదివారం లెక్కించారు. ఆరు నెలలకుగాను రూ.54 వేలు ఆదాయంగా లభించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. త్వరలో అమ్మవారి నూతన ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. ఇందుకు ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా ఉన్న సుమారు రూ.50 లక్షలతోపాటు దాతలు అందజేసిన దాదాపు మరో రూ.60 లక్షలు విరాళాలు కలిపి రూ.2 కోట్ల అంచనాతో నూతన ఆలయం రూపుదిద్దుకోనుందన్నారు.

జూదరుల అరెస్ట్

ద్వారకాతిరుమల: మండలంలోని గుళ్లపాడు గ్రామ శివారులో ఓ కోడిపందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 4 గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 8,100 నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

రహదారికి స్వచ్ఛందంగా మరమ్మతులు


సూర్యచంద్రరావుపేట మలుపులో గుంతలను కాంక్రీటుతో పూడ్చిన దృశ్యం

ద్వారకాతిరుమల: భీమడోలు-ద్వారకాతిరుమల క్షేత్ర ప్రధాన రహదారి పలుచోట్ల ధ్వంసమైంది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడటంతో వివిధ ప్రాంతాల నుంచి శ్రీవారి దర్శనార్థం ద్వారకాతిరుమలకు వెళుతున్న భక్తులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు పడిపోయి, క్షతగాత్రులు అవుతున్నారు. ఈ విషయం అధికారులు, పాలకుల దృష్టికి వెళ్లినా వారు స్పందించడం లేదు. దాంతో ప్రమాదాలను చూడలేక సూర్యచంద్రరావుపేట గ్రామానికి చెందిన వారు తమ గ్రామ శివారులోని రహదారి మలుపులో ఉన్న గుంతలను ఆదివారం కాంక్రీట్‌తో పూడ్చారు.

హడలెత్తిస్తున్న శునకాలు

- ఇటీవల 17 మందిని గాయపరిచిన కుక్కలు
- కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజల డిమాండ్



దిబ్బగూడెం-పెదవేగి ప్రధాన రహదారిపై గుంపులుగా వెళుతున్న కుక్కలు, వైరస్ సోకిన కుక్క

పెదవేగి: మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. దారిన పోయే వారిపై దాడి చేసి గాయపరుస్తుండటంతో రోడ్లపై వెళ్లాలంటేనే జనం భయపడుతున్నారు. ముఖ్యంగా కూచింపూడి, రామసింగవరం, లక్ష్మీపురం, దిబ్బగూడెం, వేగివాడ, గ్రామాల్లో ఈ కుక్కల బెడద అధికంగా ఉంది. ఇటీవల 17 మంది వీటి బారిన పడి ఆసుపత్రి పాలయ్యారు. గత ఏడాది జూలై నుంచి నేటి వరకూ 936 కేసులు పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నమోదయ్యాయంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ద్విచక్ర వాహనాలపై వెళుతున్న వారిని వెంబడిస్తుండటంతో వాహనాలు అదుపు తప్పి పలువురు గాయాలపాలవుతున్నారు.

అధికారులకు చెప్పినా..

గ్రామాల్లో కుక్కల సమస్య పరిష్కరించటం సర్పంచులకు సవాల్‌గా మారింది. గ్రామాల్లోని వార్డు సభ్యులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదు. పాఠశాలలకు, రాత్రి వేళల్లో ట్యూషన్లకు వెళ్లి వచ్చే సమయాల్లో విద్యార్థులు ఈ కుక్కల బారిన పడుతున్నారు. చిన్నారులు, అరుగులపై కూర్చుని ఉండే వృద్ధులపై తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. వీటికి తోడు వైరస్ వచ్చిన శునకాలతో ప్రజలు మరింత అబద్రతా భావం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలకు నిత్యం మండలంలో ఏదో గ్రామం నుంచి కుక్కల దాడిలో గాయపడి వస్తున్నారని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష చెబుతుండటాన్ని బట్టి చూస్తే సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో చెప్పొచ్చు. కుక్కలు ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలియదు కానీ వాటి నుంచి పలు గ్రామాల ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. ఈ కుక్కలను ఎవరైనా వాహనాల్లో వేరే ప్రదేశాల నుంచి ఇక్కడకు తీసుకొచ్చి వదిలి వేసి ఉంటారేమోనని పలు గ్రామాల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కోళ్లఫారాలను సైతం వదలని వైనం

కుక్కల దెబ్బకు ఫారాల రైతులు గిలగిలలాడుతున్నారు. వందల సంఖ్యలో ఉన్న కుక్కలు గుంపులుగా ఏర్పడి గ్రామాల్లో ఏర్పాటుచేసిన ఫారాలను నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. కోళ్లను తినడంతో పాటు షెడ్లను ఇష్టం వచ్చిన రీతిలో చెల్లాచెదురు చేస్తున్నాయని దీంతో ఫారాలవద్దే కాపలా ఉంటున్నామని రైతులు చెబుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా బీరయ్య స్వామి ఉత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

దెందులూరు: సోమవరప్పాడులో శ్రీబీరయ్య స్వామి ఉత్సవం కురుమ సామాజిక ప్రజలు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ స్వామి వారిని పలు రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ చేశారు. అనంతరం మేళ తాళాలతో స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. వీధి వీధిన భక్తులు స్వామి వారికి పూజలు చేశారు. దెందులూరు మండల వైస్ ప్రెసిడెంట్ వేమూరి జితేంద్ర, గ్రామ సర్పంచ్ సరిగే నాగరాజు, కోఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ మేకల సాంబ శివరావు, కమిటీ సభ్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి


రంగా విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న కాపు సంఘ నాయకులు

భీమడోలు: కలిదిండి, సానారుద్రవరం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే, దివంగత కాపు ఉద్యమ నేత వంగవీటి మోహన రంగా విగ్రహాలకు పేడ పూసి అవమానించిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆదివారం భీమడోలులో కాపు సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. భీమడోలు సంతమార్కెట్ వద్ద గల వంగవీటి మోహన రంగా విగ్రహానికి వారు పాలాభిషేకం చేసి, జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా కాపు సంఘం నాయకులు పసుపులేటి శ్రీనివాస్, మంచెం నాగు, నిమ్మకాయల గణ, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం మాట్లాడారు. బడుగుల అభ్యున్నతికి పాటు పడిన మహోన్నత వ్యక్తి రంగా అని, ఆయన మరణించినా ఆశయాలు సజీవంగా ఉన్నాయని, ఆయన ఆశయాల సాధనకు కాపు నాయకులు కృషి చేస్తున్నారన్నారు. రంగా విగ్రహాలకు పేడపూసి శునకానందం పొందుతున్న దోషులను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కాపు సంఘం నాయకులు రాజేష్, యర్రంశెట్టి ఏడుకొండలు, వాసు, కేడీపీ ప్రసాద్, ఈతకోట తాతాజీ, ఈతకోట సత్యకృష్ణ, దుద్దేపూడి శ్రీను, సవలం పండు, రవి పాల్గొన్నారు.

సీహెచ్‌సీ చుట్టూ అపారిశుద్ధ్యం


సీహెచ్‌సీ ఆసుపత్రి చుట్టూ మట్టి గుట్టల వద్ద నిల్వ ఉన్న మురుగు నీరు

భీమడోలు: భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం చుట్టూ మురుగు నీరు తాండవిస్తుంది. మురుగు నుంచి వచ్చే దుర్వాసనతో రోగుల ముక్కు పుటాలు అదిరిపోతున్నాయి. మురుగునీరు బయటకు పంపే అవకాశాలున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్యగా మారింది. ఉంగుటూరు నియోజకవర్గంలోనే అతిపెద్ద ఆసుపత్రిగా ఉన్న భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. వైద్యుల కొరతతో పాటు కనీస మౌలిక వసతులు కల్పించకపోవడంతో రోగులు నానా ఆగచాట్లు పడుతున్నారు. ప్రతి రోజూ ఓపీ, ఇన్‌పేషెంట్లు ఆసుపత్రిలో 500 మంది వరకు వచ్చి వైద్య సేవలందుకుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆసుపత్రి వెనుక ప్రాంతం నుంచి వచ్చిన మురుగు నీరు ఆసుపత్రి ప్రాంగణంలో నిలిచిపోయింది. దీనికి తోడుగా కొన్ని నెలల క్రితం ఆసుపత్రి ప్రాంగణాన్ని మెరక చేసేందుకు తోలిన మట్టి గుట్టలను సర్దలేదు. దీంతో మురుగు నీరు మట్టి గుట్టల వద్దకు చేరింది. బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో కొన్ని రోజులుగా మురుగు నీరు అక్కడే నిలిచి దుర్వాసన కొడుతుంది. దీంతో దోమలు విజృంభించడంతో రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇన్‌పేషెంట్లు రాత్రి వేళల్లో దోమల దాడికి తీవ్ర ఇబ్బందులు పతున్నారు. దీంతో మరిన్ని అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మట్టి గుట్టలను సర్దాలని, మురుగు నీరు బయటకు వెళ్లే మార్గాన్ని పూడిక తీయించాలని రోగులు, గ్రామస్తులు కోరుకుంటున్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి


చిన్నారులకు నీతి కథలు చెబుతున్న మండే సుధాకర్

భీమడోలు: గ్రంథాలయాలను విద్యార్థి దశ నుంచే వినియోగించుకుని విజ్ఞానాన్ని పొందాలని ఉపాధ్యాయుడు మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం చిన్నారులకు నీతి కథలు వినడం, చెప్పడం వంటి కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బాలబాలికలు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేశారు. మండే సుధాకర్ విద్యార్థులకు నీతి కథలను వినడం ద్వారా నైతిక విలువలు పెంపొందుతాయని పేర్కొన్నారు. ముని ప్రయత్నం తదితర నీతి పుస్తకాలు వారు చదవారు. ఈ సందర్భంగా వినాయక చవితి వేడుకల్లో మట్టి వినాయక విగ్రహాలను వాడాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వాడరాదని పేర్కొన్నారు. దీని వలన పర్యావరణం, నీరు కలుషితమై ప్రకృతిలోని జీవరాశులకు పెనుముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో గ్రంథపాలకులు డీఎస్‌టీ అమర్‌నాథ్, కె.శ్రీనివాసరావు, జి.బంగారు పాప, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్


ఏలూరు (టూటౌన్): బాల్య వివాహాలకు సంబంధించి ఒక్క కేసు కూడా నమోదు కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం వెన్నవెల్లివారిపేటలో ఆదివారం బాల్య వివాహాలు- గర్భధారణ వల్ల కలిగే నష్టాలు పైన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు 18 ఏళ్లు, పురుషులకు 21 ఏళ్లు నిండిన తరువాత మాత్రమే వివాహాలు జరిపించాలని అన్నారు. బాల్యదశలో వివాహాలు జరిపించడం వల్ల బాలికలకు ఆరోగ్య సమస్యలు సంభవించడమే కాకుండా కొన్ని పరిస్థితుల్లో తల్లి, బిడ్డ మరణాలు సంభవిస్తున్నాయన్నారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే మహిళలు పూర్తి ఆరోగ్యంగా ఉంటారని, పుట్టిన బిడ్డ కూడా ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. కాబట్టి వివాహ వయస్సు దాటిన తర్వాత మాత్రమే వివాహాలు జరిపించాలని సూచించారు. ఎలాంటి న్యాయ సహాయం కావాల్సి ఉన్నా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలను కాని 15100 నంబర్‌కు గానీ ఫోన్ చేయాలని కోరారు. ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ మాట్లాడుతూ పౌరులు ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. విద్య లేకపోవడం వల్ల బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను తెలుసుకోలేరని, కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉన్నత చదువులు నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డెమో డాక్టరు దీపిక, సీడబ్ల్యూసీ ఇన్‌చార్జి చైర్మన్ పి.వెంకటేశ్వర రావు, మాస్టరు ట్రైనీ పి.రత్నరాజు, ఏలూరు గిరిజనుల సంఘ ప్రెసిడెంటు కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

జంగారెడ్డిగూడెం: ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో 17వ గ్రామోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు ముగిశాయి. వీటిలో చింతలపూడి ప్రథమ స్థానం, రెడ్డి గణపవరం ద్వితీయ స్థానం, బుట్టయిగూడెం మూడవ స్థానం, దిబ్బగూడెం నాలుగవ స్థానం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం జరిగిన కార్యక్రమానికి జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ యువతను ప్రోత్సహించడానికి ఈ క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రాముడు, పాలపర్తి శ్రీనివాస్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ధనరాజు, విశ్రాంత ఉపాధ్యాయుడు నరసింహరాజు, ఈషా ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ జయ సాయి, సత్య గంగాధర్, ఈషా వాలంటీర్లు పాల్గొన్నారు.

వంతెన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

నారాయణపురం వంతెనకు తాత్కాలిక మరమ్మతులు


వంతెనపై పైపులైన్ మార్పు పనులు చేస్తున్న కార్మికులు


కొత్త పైపు లైన్లు తయారు చేస్తున్న కార్మికులు

ఉంగుటూరు: ఎట్టకేలకు నారాయణపురం వంతెన మరమ్మతులు చేయనున్నారు. ఈ నేపథ్యంలో రంధ్రం పడిన ప్రాంతంలో ఐరన్ షీట్లు వేసి పూడ్చివేసి ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు నిర్మించనున్నారు. దాని పైన తేలికపాటి వాహనాలు నడిచేందుకు అడ్డు లేకుండా ఈ మరమ్మతులు ఉపయోగపడనున్నాయి. ఆ విధంగా తాత్కాలిక మరమ్మతులు చేద్దామని ఆర్అండ్‌బీ అధికారులు యోచిస్తున్నారు. కొత్త వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి శాశ్వతంగా సమస్యను పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు. కొత్త వంతెన నిర్మాణానికి భారీగా నిధులు కావాల్సి ఉండటంతో ఈ నిధులు ఇప్పట్లో మంజూరు అయ్యే అవకాశాలు లేనందున ఈ లోపు చిన్న కార్లు, ఆటోలు, ఖాళీ లారీలు తిరిగేందుకు వీలుగా మరమ్మతులు చేద్దామని భావిస్తున్నారు. అందులో భాగంగా వంతెన ప్రహరీ గోడకు కొల్లేరు గ్రామాలకు వెళ్లే మంచినీటి పైపులైన్ అడ్డుగా ఉండటంతో ఆ పైపు లైన్ అత్యవసరంగా తొలగించమని కలెక్టర్ స్వయంగా ఆదేశించారు. ఈ క్రమంలో రూ.5 లక్షల వ్యయంతో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఇంజనీర్ ఈ పనులు నిర్వహిస్తున్నారు. ఇపుడు వంతెన పైనున్న పైపులైన్ వంతెన కింద భాగం నుంచి వెళ్లేలా ప్రణాళిక తయారు చేసుకున్నారు. కొత్త పైపు లైన్లు తెచ్చి వెల్డింగు పనులు చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మారావు పర్యవేక్షిస్తున్నారు. అలాగే అడుగు భాగంలో పైపులైను పంపడానికి అనుకూలతలు వెతుకుతున్నారు. ఈ మేరకు నాలుగు రోజుల నుంచి పనులు వంతెన వద్ద నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా నూతన బ్రిడ్జి వస్తుందనుకున్న ఆశావహులకు నిరాశే మిగిలింది. స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుపై కూడా ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడుల నుంచి అధిగమించేందుకు ప్రస్తుతం తాత్కాలికంగా మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. ఆ మేరకు తరచూ ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఎప్పటికపుడు సమీక్షలు చేస్తున్నారు. పనులు వేగవంతం అయ్యేలా ఆదేశాలు ఇస్తున్నారు. కొత్త బ్రిడ్జికి నిధులు మంజూరయ్యాక ఆ బ్రిడ్జి నిర్మాణ పనుల విషయం మొదలు పెడతారు. ఉన్నతాధికారులు చొరవ చూపి వంతెన సమస్యకు తాత్కాలికంగా కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

● మొదలైన వినాయక చవితి సందడి


గణపతి విగ్రహాలను కొనుగోలు చేస్తున్న ఉత్సవ నిర్వాకులు


విక్రయానికి సిద్ధంగా ఉన్న బొజ్జ గణపతి విగ్రహాలు

గ్రామాల్లో ప్రత్యేక పూజలందుకునేందుకు గణపయ్య సిద్ధమయ్యారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించేందుకు భక్తులు సన్నద్ధమవుతున్నారు. భారీ ప్రతిమలను ఏర్పాటు చేసేందుకు పోటీ పడుతున్నారు. ప్రస్తుతం గణపతి విగ్రహాలు రూ.2500, నుంచి రూ. 7 వేల వరకు ధర పలుకుతున్నాయి. ఇప్పటికే మండలంలో చలువ పందిళ్లు సిద్ధం చేస్తున్నారు. - పెదవేగి

అక్రమ టోల్‌పై చర్యలేవి?

కుక్కునూరు: మండలంలోని పెద్దరావిగూడెం, గణపవరం, ఇబ్రహీంపేట, బంజరగూడెం, బోనగిరి, అల్లిగూడెం, వేలేరు గ్రామాల్లో వెయ్యికి పైగా నర్సరీలను ఎటువంటి అనుమతులు లేకుండా గిరిజన భూముల్లో గిరిజనేతరులు అక్రమంగా నిర్వహిస్తున్నారని సీపీఎం జిల్లా నాయకుడు యర్రంశెట్టి నాగేందర్‌రావు ఆరోపించారు. ఆదివారం కుక్కునూరులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమంగా నిర్వహిస్తున్న జామాయిల్ నర్సరీలపై అధికారులు చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు. దీనికి తోడు బయట పెద్దరావిగూడెం గ్రామ పంచాయతీలు బయట వ్యక్తులకు వేలంపాట పేరుతో ఇచ్చి అక్రమంగా టోల్ పన్ను వసూలు చేస్తున్నారన్నారు. జామాయిల్ మొక్కలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నప్పటికీ స్థానిక వ్యాన్, మినీ వ్యాన్ డ్రైవర్లకు ఉపాధి ఉండడం లేదన్నారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

27న గణపతి ఆలయ ప్రారంభోత్సవం


ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న గణపతి ఆలయం

కొయ్యలగూడెం: స్థానిక గణేష్ సెంటర్లో పునర్నిర్మించిన శ్రీ విఘ్నేశ్వర ఆలయం ఈనెల 27న ప్రారంభోత్సవానికి ముస్తాబవుతోంది. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆరోజున ఆలయ ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నట్లు గణపతి యువజన సేవా సంఘం తెలిపింది. సుమారు 80 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం జీర్ణోద్ధరణ చెందడంతో నూతనంగా రూ.25 లక్షల వ్యయంతో ఆలయాన్ని పునర్నిర్మించారు. నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఆలయం ఉండడంతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అత్తిలి తరువాత ఉత్సవాల నిర్వహణకు కొయ్యలగూడెం గణేష్ సెంటర్‌లోని ఆలయం ప్రఖ్యాతిగాంచింది. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా సామాజిక కార్యక్రమాల్లో భాగంగా టీటీడీ కల్యాణ మండపానికి, బాలికల సంక్షేమ వసతి గృహం ఏర్పాటుకు చెరో ఎకరం మేర భూములను గణపతి యువజన సేవా సంఘం ఆలయ నిధులను కేటాయించి సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఉత్సవాలకు అనిపెద్ది పరదేశి ప్రసాద శర్మ ఆధ్వర్యంలో ఆధ్యాత్మికవేత్తలను ఆహ్వానిస్తున్నట్లు కమిటీ పేర్కొంది.

ముమ్మరంగా ఖరీఫ్ పనులు


దుద్దుకూరు సమీపంలో ప్రత్తి పంటలో దుక్కి దున్నుతున్న దృశ్యం


తెల్లంవారిగూడెం సమీపంలో మినుము పంట వేసిన దృశ్యం

బుట్టాయగూడెం: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో ఖరీఫ్ సాగు పనులు ఊపందుకున్నాయి. మండలంలోని ప్రతి గ్రామంలో ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వరినాట్లు వేసి వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులకు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో వర్షాలు విస్తారంగా కురవడంతో రైతులకు కొంత ఊరట లభించింది. దీనితో వరినాట్లను ముమ్మరంగా వేయడంతోపాటు ప్రత్తి, మొక్కజొన్న, మినుము, వేరుశనగ, తదితర పంటలను విస్తారంగా వేశారు.

ఊపందుకున్న సాగు పనులు

ఖరీఫ్ సీజన్‌లో బుట్టాయగూడెం మండలంలో వరిసాగు 4,246 ఎకరాలు లక్ష్యం కాగా ఇప్పటివరకూ దాదాపు 1,650 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా జీలుగుమిల్లి మండలంలో 2,658 ఎకరాలు లక్ష్యం కాగా సుమారు 2,005 ఎకరాల్లో వరినాట్లు వేశారు. అదేవిధంగా పోలవరం మండలంలో 5,582 ఎకరాలు లక్ష్యం కాగా ఇప్పటివరకూ 3,685 ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి. అదేవిధంగా కొయ్యలగూడెం మండలంలో 9,115 ఎకరాలు లక్ష్యంకాగా ఇప్పటివరకూ 6,350 ఎకరాల్లో వరినాట్లు వేసినట్లు అధికారులు చెప్పారు. అదేవిధంగా టి.నర్సాపురం మండలంలో 2,400 లక్ష్యంకాగా 1,410 ఎకరాల్లో వరినాట్లు వేశారు. అదేవిధంగా వేలేరుపాడు మండలంలో 2,305 ఎకరాలు లక్ష్యంకాగా ఇప్పటివరకూ 350 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేశారు. అదేవిధంగా వేలేరుపాడు మండలంలో 1,381 ఎకరాలు లక్ష్యంకాగా కేవలం 70 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేసినట్లు అధికారులు తెలిపారు. అయితే ప్రత్తి, మినుము, వేరుశనగ పంటలను కలిపి మొత్తం 50,909 ఎకరాలకు గాను ఇప్పటివరకూ 22,654 ఎకరాల వరకూ సాగు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.